సాక్షి ప్రకాశం

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



మిత్ర ద్రోహానికి కూటమి సిద్ధం
ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించే యోచనలో ఉన్న ప్రభుత్వ చర్యలతో ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కరువైంది. - 8లో..



నత్తనడకన బాల ఆధార్
జిల్లాలో బాల ఆధార్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకోక, సరైన అవగాహన లేక మందకొడిగా సాగుతోంది. - 8లో..

గరిష్టం/కనిష్టం 32/23

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో యువతీ, యువకులను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేయటానికి ర్యాంపు పథకం ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద ప్రత్యేకంగా ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ఒక బ్యాచ్‌కు, ఈ నెల 28వ తేదీ నుంచి రెండో బ్యాచ్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ట్రెండ్జ్ ఐటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించుకోవటానికి అవసరమైన అవగాహన, ప్రాజెక్టు ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఉచిత శిక్షణకు హాజరు కావాల్సిన అభ్యర్థుల వయస్సు 18 నుంచి 58 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఆధార్ కార్డు, పాస్ పోర్టు సైజు ఫొటోలు, కులధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు తీసుకొని ఈ నెల 24వ తేదీన సంబంధిత కార్యాలయాల్లో హాజరు కావాలన్నారు. ఔత్సాహికులైన నిరుద్యోగ యువతీ, యువకులు ట్రెండ్జ్ కార్యాలయాలు ఒంగోలు నగరంలోని అంజయ్య రోడ్డులోని డొమినోస్ పిజ్జా ఎదురుగా కోటయ్య ప్లాజాలోని రెండో అంతస్తులో కార్యాలయంలో, మార్కాపురంలోని గణేష్ నగర్ పోస్టల్ ఏరియా కొండపల్లి రోడ్డులో ఉన్న ట్రెండ్జ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం 91606 07606, 70937 73775 సెల్ నంబర్లను సంప్రదించి సమాచారం తెలుసుకోవాలన్నారు.

రోస్టర్ సరిచేశాకే గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలి

- అఖిల భారత యువజన సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి వీరారెడ్డి



కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: రోస్టర్ విధానం సరిచేసిన తర్వాతనే గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి వీరారెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు యువతకి ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. డీఎస్సీని వెంటనే విడుదల చేసి యువతకి ఉపాధి కల్పించాలన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాస రావు మాట్లాడుతూ నిన్నటి వరకు కోర్టులో ఉందని చెప్పి సమయం లేకుండా ఈ నెల 23 తేదీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరైన పద్ధతి కాదని, రోస్టర్ సరిచేసి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బాషా, సలోమాన్, విజయరాజ్, సంపత్, మహేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు దొనకొండ విద్యార్థులు



పోటీల్లో పాల్గొంటున్న దొనకొండ జెడ్పీ విద్యార్థులు

దొనకొండ: రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలు ఈ నెల 16న తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించారు. జిల్లా నుంచి దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పత్తి వెంకట లక్ష్మీనారాయణ, ఎనబరి ప్రైజీ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి హర్యానాలో నిర్వహించే జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వీరు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు కాలే నరసింహారావు తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు దొనకొండ విద్యార్థులు ఈ నెల 23 నుంచి 24వ తేదీ వరకు కర్నూలులో రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారని, ఈ పోటీలకు జిల్లా జట్టుకు దొనకొండ జెడ్పీ పాఠశాలకు చెందిన చంద్రశేఖర్, ఏడుకొండలు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహారావు తెలిపారు.

చారిత్రక సంపదపై కేటుగాళ్లు..



దర్శి సమీపంలో గుప్తనిధుల కోసం కొండపై తవ్విన 15 అడుగుల గుంత, (ఇన్‌సెట్‌లో) బేస్తవారిపేటలో పట్టుకున్న రైస్‌పుల్లింగ్ పాత్ర

పశ్చిమ ప్రకాశం వందల సంవత్సరాల చారిత్రక నేపథ్యమున్న ప్రాంతం. వేల హెక్టార్లలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇక్కడ వందల సంవత్సరాల నాటి పురాతన ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంపై గుప్త నిధుల వేటగాళ్ల కన్నుపడింది. భక్తులు వెళ్లలేని జీర్ణావస్థలో ఉన్న ఆలయాల్లో తవ్వకాలు చేస్తూ అత్యంత విలువైన సంపదన దోచేస్తున్నారు. మరో వైపు రైస్ పుల్లింగ్ ముఠా సైతం పురాతన దేవాలయాలే లక్ష్యంగా పాల్పడుతున్న ఆగడాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా బేస్తవారిపేటలో రైస్ పుల్లింగ్ పేరుతో జరిగిన మోసం, దర్శి సమీపంలో ఓ కొండపై గుప్త నిధుల కోసం 15 అడుగుల గుంత తీసిన ఘటనల నేపథ్యంలో జిల్లాలో రైస్ పుల్లింగ్, గుప్త నిధుల వేటపై చర్చ మొదలైంది.

పీడీ యాక్ట్ పెడతాం



గుప్త నిధుల పేరుతో వారసత్వ సంపదను ధ్వంసం చేస్తే పీడీ యాక్ట్ పెడతాం. పురాతన సంపదలైన ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, శతాబ్దాల నాటి శాసనాలను రక్షించుకునేందుకు గట్టి చర్యలు తీసుకుంటాం. సులభంగా డబ్బులు సంపాదించాలని రైస్ పుల్లింగ్ పేరుతో బయలు దేరిన ముఠాల వివరాలు సేకరించమని అధికారులను ఆదేశించా. నేరాలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షిస్తాం. వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం. ప్రజలు కూడా ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్మొద్దు. గుప్త నిధులు లేవు, రైస్ పుల్లింగ్ లేదు. ఇలాంటివి నమ్మి చేజేతులా డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా పోలీసు కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడతారు.

– ఎస్పీ ఏఆర్ దామోదర్

- పశ్చిమాన పురాతన దేవాలయాలే టార్గెట్
- రెచ్చిపోతున్న రైస్‌పుల్లింగ్, గుప్తనిధుల తవ్వకాల ముఠాలు
- ఇతర రాష్ట్రాల నుంచి రాక
- నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు
- రైస్ పుల్లింగ్ పేరుతో పురాతన దేవాలయాలు, ధ్వజ స్తంభాల మీద ఉన్న కలశాల చోరీ
- రక్షణ కరువైన పురాతన దేవాలయాలు
- బేస్తవారిపేట, దర్శి ఘటనలతో చర్చ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పశ్చిమ ప్రకాశం కొత్తిపి చాళుక్యులు.. విజయనగర రాజులు.. కాకతీయ రాజులు, అలాగే శాయపునాయుడి వంశస్తులు పాలించారని తెలియజేసే ఎన్నో ఆధారాలు పదిలంగా ఉన్నాయి. మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు తదితర ప్రాంతాలకు పురాతన, చారిత్రక నేపథ్యముంది. అలాగే పలు మండలాల్లో నల్లమల అటవీ ప్రాంతం కూడా విస్తరించి ఉంది. అటవీ ప్రాంతంలో అత్యంత పురాతన దేవాలయాలు అనేకం ఉన్నాయి. జీర్ణావస్థలో ఉన్న దేవాలయాలు, భక్తులు వెళ్లేందుకు అనువుగా లేని దేవాలయాలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం గుప్త నిధుల వేటగాళ్లు, రైస్ పుల్లింగ్ ముఠాలు వీటిపై కన్నేసినట్లు సమాచారం. ఈ అటవీ ప్రాంతంలో ఎక్కడ వీరభద్ర స్వామి విగ్రహం ఉంటుందో అక్కడ గుప్త నిధులు ఉన్నట్లు అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. దాంతో గుప్త నిధుల కోసం వీరభద్ర స్వామి ఉన్న దేవాలయాలను టార్గెట్ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే పాలంక క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పాలంక వీరభద్రుడి దేవాలయంలో గుప్త నిధుల కోసం అనేకసార్లు తవ్వకాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కృష్ణా నది ఒడ్డున ఆ మధ్య బంగారు నాణేలు బయట పడ్డాయి. ఆనోటా ఈ నోటా పడి ప్రచారం కావడంతో ప్రభుత్వ అధికారులు రంగంలోకి దిగి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులోంచి కొన్ని నాణేలను ఒక ఫారెస్టు అధికారి నొక్కేసినట్లు ప్రచారం జరిగింది. ఈ ప్రాంతంలో కృష్ణ దేవరాయలు హయాంలో నిర్మించిన ఆలాటం కోట ఉంది. ఈ కోటలో ఆంజనేయ స్వామి విగ్రహం ఉంది. ఆరోజుల్లోనే నిధుల కోసం ఈ కోటపై దాడి జరిగినట్లు చరిత్రలో ఉంది. యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద 12 అడుగుల వినాయక విగ్రహం, శ్రీశైలం ప్రాంతంలో ఇష్టకామేశ్వరి దేవాలయం పరిసరాల్లో కూడా గుప్త నిధుల కోసం ఓ ముఠా ప్రయత్నం చేసి విఫలమైనట్లు సమాచారం. దద్దణాల ఆంజనేయ స్వామి గుడిలో కూడా తవ్వకాలు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం వరకు గుప్త నిధుల వేట జోరుగా కొనసాగింది. దానికితోడు రైస్ పుల్లింగ్ వ్యవహారం కూడా నడిచింది. ఇటీవల కొంత కాలం స్తబ్దుగా ఉన్నట్లు కనిపించినా బేస్తవారిపేటలో రైస్ పుల్లింగ్ యంత్రం ఉన్నట్లు నమ్మించి విక్రయించే ప్రయత్నాలు చేయడంతో ఈ వ్యవహారం చాపకింద నీరులా కొనసాగుతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుప్త నిధుల వేటగాళ్లే రైస్ పుల్లింగ్ పేరుతో లావాదేవీలు నడపడం గతంలో జరిగింది. ఇప్పుడు బేస్తవారిపేట వ్యవహారంలో కూడా అదే గుప్త నిధుల బ్యాచ్ తెరవెనక కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. తెరవెనుక సూత్రధారులను పట్టుకునేందుకు పోలీసులు దృష్టిసారించారు.

50కి పైగా శాసనాలు ధ్వంసం...

పురాతన దేవాలయాల్లో ఉన్న శాసనాల కింద నిధులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో గుప్త నిధుల వేటగాళ్లు పురాతన దేవాలయాల్లో శాసనాలు కనిపిస్తే చాలు అక్కడ ధ్వంసం చేసేస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం, దాని సరిహద్దులు, పొలాల్లో సుమారు 50 కి పైగా శాసనాలు ఉన్నట్లు జిల్లాకు చెందిన ఒక పరిశోధకుడు తెలిపారు. గుప్త నిధుల వేటగాళ్లు ఆ శాసనాలను, అక్కడ ఉన్న విగ్రహాలను పగులగొట్టినట్లు సమాచారం. యర్రగొండపాలెంలోని అయ్యంబొట్లపల్లి దగ్గర ఉన్న 8వ శతాబ్దానికి చెందిన రామలింగేశ్వర స్వామి విగ్రహం, గర్భాలయాన్ని సైతం ధ్వంసం చేశారు. దొనకొండ మండలంలోని కొచ్చర్ల కోట రామలింగేశ్వర స్వామి ఆలయం, పుల్లల చెరువు మండలంలోని శతకోడులో పదో శతాబ్దానికి చెందిన సప్తకోటి శివాలయంలో కూడా గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారు.

జిల్లాలోని బేస్తవారిపేటను డెన్ గా ఏర్పాటు చేసుకొని ఈ ముఠాలు మోసాలకు తెగబడుతున్నట్లు సమాచారం. ఈ ముఠాలో కనిగిరి, మార్కాపురం, రాచర్ల, కంభం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల, మార్కాపురం, తర్లుపాడుకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరిని పట్టుకుని విచారణ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్ శివనాగసాయి దత్తాశ్రమం పక్కన ఉన్న కొండ పైన గుప్త నిధుల కోసం 15 అడుగుల లోతు తవ్విన సంఘటన ఈనెల 4న వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.

యర్రగొండపాలెం, త్రిపురాంతకం దేవాలయాల్లో తవ్వకాలు...

ఇక యర్రగొండపాలెంలోని మిల్లంపల్లి వేణుగోపాల స్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం ఎన్నిసార్లు తవ్వకాలు జరిగాయో లెక్కేలేదు. గ్రామ శివారులో ఉండడంతో దీనికి పెద్దగా రక్షణ లేదు. దేవాలయం గర్భగుడిలోని మూల విరాట్ విగ్రహం శిరస్సును సైతం ఎత్తుకెళ్లిపోయారు. గుడి లోపలి గోడలపై ఉన్న చిత్రాలను విధ్వంసం చేసి పూజలు నిర్వహించారు. కొన్నేళ్ల క్రితం యర్రగొండపాలెంలో మరకత వినాయకుడి విగ్రహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసులో ఒక పంచాయతీ అధికారి, ముగ్గురు ప్రజా ప్రతినిధుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. త్రిపురాంతకంలోని ప్రసిద్ధ త్రిపుర సుందరి దేవాలయంలో కూడా తరచుగా తవ్వకాలు జరిగాయి.. జరుగుతూనే ఉన్నాయి. త్రిపుర సుందరి దేవాలయం ఎదుట నంది విగ్రహంలో వజ్రాలు పొదిగి ఉన్నాయని దాన్ని విధ్వంసం కూడా చేశారు.

ప్రభుత్వానికి పట్టని విధ్వంసం...

గుప్త నిధుల కోసం పురాతన దేవాలయాలు, విగ్రహాలు, శాసనాలను ధ్వంసం చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవదాయ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంగా గుప్త నిధుల వేటగాళ్లపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి రాక...

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధులు ఉన్నాయన్న ప్రచారంతో హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల నుంచి కూడా కొన్ని ముఠాలు వచ్చి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమధ్య పెద్దారవీడు మండలంలోని కొండ ప్రాంతంలో గుప్త నిధుల కోసం యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్న బెంగళూరుకు చెందిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బుధవారం బేస్తవారిపేటలో జరిగిన రైస్ పుల్లింగ్ కోసం హైదరాబాద్ నుంచి ఇద్దరు వ్యక్తులు రావడం గమనార్హం. పల్నాడు జిల్లా, నుంచి కూడా ఇక్కడకు కొన్ని ముఠాలు వస్తున్నాయని తెలుస్తోంది.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈనెల 23న 7 కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్
- మార్చి 1 నుంచి 67 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు
- మార్చి 17 నుంచి 183 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన ఎస్పీ, జేసీ

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నీ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. గ్రూప్-2, ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై శుక్రవారం ప్రకాశం భవనంలోని మినీ మీటింగ్ హాల్‌లో ఎస్పీ దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ 7 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 4,544 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలైన క్విస్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 944 మంది, శ్రీనాగార్జున డిగ్రీ కళాశాలలో 600 మంది, శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల, పీజీ కళాశాలలో 600 మంది, రైస్ కాలేజీలో రెండు కేంద్రాల్లో 1200 మంది, పేస్ కళాశాలలో రెండు కేంద్రాల్లో 1200 మంది అభ్యర్థులను కేటాయించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు కోఆర్డినేటింగ్ అధికారిగా జేసీ గోపాలకృష్ణ ఉంటారన్నారు. ఏడుగురు జిల్లా స్థాయి లైజన్ అధికారులను నియమించామన్నారు. పేపరు-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపరు-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఏదైనా సమాచారం లేదా ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్ నెంబరు 88011 88046 కు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయనున్న 42,439 మంది:

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం 21,624 మంది, రెండో సంవత్సరం 20,815 మంది చొప్పున మొత్తం 42,439 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. వీటికి గాను చీఫ్ సూపరింటెండెంట్లు 67 మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 67 మంది, 27 మంది కస్టోడియన్లు, 3 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 3 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి ప్రత్యేక అధికారిగా ఐ.శ్రీనివాసరావు నియమించారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ విషయంలో ఏమైనా సమస్యలున్నా ఒంగోలులోని ఆర్‌ఐఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 08592-281275 ను సంప్రదించవచ్చన్నారు. మొబైల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి తీసుకురావద్దని చెప్పారు.

183 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 183 కేంద్రాల్లో నిర్వహిస్తారని, 29,602 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరికి ఉదయం గం.9.30 నుంచి గం.12.45 వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఓపెన్ ఇంటర్మీడియెట్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు 21 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. వీరికి మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఓపెన్ పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నారనీ, ఇందులో 1564 మంది విద్యార్థులు 23 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వీరికి పరీక్ష ఉదయం గం.9.30 నుంచి గం.12.30 వరకు ఉంటుందని తెలిపారు.

పటిష్ట భద్రత:

ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉందని చెప్పారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ లో పోలీస్ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ ద్వారా కూడా భద్రతను పర్యవేక్షిస్తామని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో మెయిన్స్ పరీక్ష గురించి తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టినా, షేర్ చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ పరీక్షా కేంద్రం వద్ద ఎవైనా ఘటన జరిగినా వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266 కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో డీఆర్వో బి.చిన ఓబులేసు, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ అత్తోట కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

- పది విద్యార్థుల ప్రేరణ తరగతుల్లో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎస్ లక్ష్మా నాయక్

ఒంగోలు వన్‌టౌన్: పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎ.లక్ష్మా నాయక్ అన్నారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో జిల్లాలోని ఒంగోలు, కొండపి సహాయ సాంఘిక సంక్షేమ అధికారుల పరిధిలోని 15 వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 7 సహాయ సాంఘిక సంక్షేమ అధికారుల పరిధిలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న 934 మందికి ఈ ప్రేరణ తరగతులను ఎక్కడికక్కడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు 6 సబ్జెక్టుల్లో ప్రావీణ్యం ఉన్న ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా ఈ ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన ఈ ప్రేరణ తరగతుల్లో మొత్తం 183 మంది విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇప్పటికే ఆల్ ఇన్ వన్ గైడ్లు, స్టడీ మెటీరియల్, స్టేషనరీ మెటీరియల్‌ను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ నీలిమ, డీసీఈబీ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి బీ కిరణ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు కిషోర్, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టీ లింగయ్య, వసతి గృహ అధికారులు డీ అంకబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

- మార్చి నెల 24, 25 తేదీల్లో దేశ వ్యాప్త సమ్మె సన్నాహక నిరసనలో యూఎఫ్‌బీయూ నాయకులు

ఒంగోలు సబర్బన్: బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో కర్నూలు రోడ్డులోని ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ ముందు శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. మార్చి 24, 25 తేదీల్లో జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సన్నాహక నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఒంగోలు నగరంలోని బ్యాంకులతో పాటు పరిసర ప్రాంతాల్లోని దాదాపు 9 యూనియన్లకు చెందిన బ్యాంకుల ఉద్యోగులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరసనలో కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సీనియర్ నాయకులు, ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ గుంటూరు మాడ్యూల్ వైస్ ప్రెసిడెంట్ వీఎస్‌ఆర్ సుధాకర రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మేనేజ్‌మెంట్లను అడ్డంపెట్టుకొని బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజలకు జరిగే నష్టాన్ని తెలియజేయటానికి బ్యాంకు ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా రోడ్డుమీదకు వచ్చారన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో వారంలో 5 రోజుల పనిదినాలు, బ్యాంకుల్లో అన్ని తరగతుల ఉద్యోగాల భర్తీచేయాలని డిమాండ్ చేశారు. టెంపరరీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకట రెడ్డి, వి.శ్రీనివాస రావు, సీహెచ్.శ్రీనివాస రావు, సుబ్బారావు, షేక్ హసన్, ఉమా శంకర్‌తో పాటు 9 బ్యాంకు యూనియన్లకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే సిజేరియన్ కాన్పులు చేయాలి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాసులు రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

ఒంగోలు టౌన్: అత్యవసరమైతేనే తప్ప సిజేరియన్ కాన్పులు చేయరాదని, సాధారణ కాన్పులకు ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. డీఎంహెచ్‌ఓ డా.వెంకటేశ్వరరావుతో కలిసి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న జనన, మరణ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకున్న వారికి డిశ్చార్జ్ సమయంలోనే బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని చెప్పారు. ప్రసవాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ ఎప్పటికప్పుడు పూర్తి సమాచారంతో పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్నీ ప్రాథమిక వైద్యాశాలల్లో ప్రతి నెలా కనీసం 10 కాన్పులు చేయాలని చెప్పారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు, డేటా మేనేజర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మిత్ర ద్రోహానికి కూటమి సిద్ధం

వైద్యమిత్రల ఉద్యోగ భద్రతపై నీలినీడలు

- ఆరోగ్యశ్రీని భీమా కంపెనీలకు అప్పగించేందుకు యోచనలో కూటమి ప్రభుత్వం
- ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్ ఐడీ ద్వారా వేతనం పొందుతున్న వైద్యమిత్రలు
- ప్రైవేట్‌వారికి అప్పగిస్తే తమ ఉద్యోగాలకు భద్రత ఉండదని ఆందోళన
- కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తమను గుర్తించాలని డిమాండ్
- జిల్లాలో 123 వైద్యశాలల్లో 147 మంది వైద్యమిత్రలు



కంభం:

కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్) పథకాన్ని భీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులేసిన ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి కొత్త విధానంలో ఎన్టీఆర్ వైద్య సేవ నిర్వహణ కొనసాగుతుందని వార్తలు వస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న సుమారు 2,500 మందికి పైగా వైద్యమిత్రలు, దాని పరిధిలో పనిచేసే ఇతర ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగులు తమ మిత్రులని, అన్ని విధాలా అండగా ఉంటామని ఎన్నికల వేళ హామీ ఇచ్చిన కూటమి నేతలు.. గద్దెనెక్కిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

2008లో దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన ఆరోగ్యశ్రీ పథకంలో నాడు స్థానికతను బట్టి ఉద్యోగులను ఎంపిక చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేసే ఉద్యోగులను ఆప్కాస్ (ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ సర్వీస్) కిందకు చేర్చారు. వారికి సీఎఫ్ఎంఎస్ ఐడీ ద్వారా ప్రతి నెల విధిగా వేతనం ఇవ్వడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించారు. సీఎఫ్ఎంఎస్‌లో వేతనం తీసుకోవడం వల్ల వారిని ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా పరిగణించారు. ప్రభుత్వ పథకాలు లేనప్పటికీ భవిష్యత్తులో తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందన్న ఆశతో వారు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవను భీమా పరిధిలోకి తీసుకెళ్లే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తుండటంతో వారంతా ఆందోళకు గురవుతున్నారు. తమను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంచుతారో లేక ఊడబీకుతారోనన్న అయోమయంలో ఉద్యోగులు ఉన్నారు.



వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ హెల్ప్‌డెస్క్

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో 123 వైద్యశాలల్లో 147 మంది వైద్యమిత్రలు పనిచేస్తున్నారు. వీరిలో 90 శాతం మంది సుమారు 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారు ఉన్నారు. ఎక్కువ మంది డిగ్రీతోపాటు పీజీలు చేసిన వారున్నారు. వైద్యమిత్రలతో పాటు జిల్లాలో టీమ్ లీడర్లు 8 మంది, డీఎం ఒకరు, ఆఫీస్ అసోసియేట్లు ఇద్దరు పనిచేస్తున్నారు. తమను బీమా సంస్థల పరిధిలోకి తీసుకొస్తే తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిపోతుందని వైద్య మిత్రలు, ఇతర సిబ్బంది వాపోతున్నారు.

17 ఏళ్లుగా సేవలందిస్తూ..

రోగులు వైద్యశాలలో చేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకునే వరకు వైద్యమిత్రలు పర్యవేక్షిస్తుంటారు. వైద్యశాలలకు వచ్చిన పేద ప్రజలకు వారికి అవసరమైన సమాచారాన్ని అందిస్తూ వారికి సేవలందిస్తుంటారు. వీరితోపాటు ఉద్యోగుల హెల్త్‌కార్డులు, జర్నలిస్ట్ హెల్త్‌కార్డు, ఆరోగ్య రక్ష స్కీమ్‌కు సంబంధించి సేవలందిస్తుంటారు. ఇలా అన్ని విభాగాల్లో దాదాపు 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వయసు కూడా చాలా మందికి 50 సంవత్సారాలు దాటింది. ఆరోగ్యశ్రీ ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే ఎవరిని ఉంచుతారో, ఎవరిని తొలగిస్తారోనని ఆందోళనగా ఉందని, ఈ వయసులో వేరే ఉద్యోగాలు వచ్చే అవకాశం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వైద్యమిత్రలను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతను కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో వెయిటేజీ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వైద్యమిత్రలు కోరుతున్నారు.

జిల్లాలో ఆరోగ్యశ్రీ ముఖ చిత్రం

ఆరోగ్యశ్రీ సేవలందించే వైద్యశాలలు	123
పీహెచ్‌సీలు	70
కమ్యూనిటీ వైద్యశాలలు	8
ఏరియా వైద్యశాలలు	2
జిల్లా వైద్యశాలలు	2
ప్రైవేట్, ఇతర వైద్యశాలలు	41
ఉద్యోగుల వివరాలు	
వైద్యమిత్రలు	147
టీమ్ లీడర్లు	8
డీఎం	1
ఆఫీస్ అసోసియేట్లు	2

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి



డిగ్రీలు, పీజీలు చదువుకొని పదిహేడేళ్లుగా వైద్యమిత్రలుగా పనిచేస్తున్నాం. ఆప్కాస్ రద్దు చేసే పక్షంలో తమను ట్రస్టు పరిధిలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలి. ఎక్కడ విధులు నిర్వహించే వారిని అక్కడే బదిలీ చేయకుండా కొనసాగించాలి.

– బి.శేఖర్, ఏపీ ఎన్టీఆర్ వైద్య సేవ స్టేట్ సెక్రటరీ

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- పొలాల్లోకి పల్టీలు కొట్టిన కారు


పల్టీలు కొట్టుకుంటూ పొలంలోకి దూసుకెళ్లిన కారు


ముక్కు వద్ద లోతైన గాయమైన హర్షణ్

బేస్తవారిపేట: మండలంలోని కలగొట్ల సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోరుమామిళ్లకు చెందిన పశువైద్యాధికారి ఆదిత్య, భార్య సాయిసౌజన్య, పిల్లలు హర్షణ్, రాజీ తమ కారులో దర్శిలో జరుగుతున్న బంధువుల వివాహానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఉన్న వీరి కారు కలగొట్ల వద్ద రోడ్డుపై లోతైన గుంతలను తప్పించే క్రమంలో అదుపుతప్పి పల్టీలు కొట్టుకుంటూ పొలంలో పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి కారు ప్రమాదాన్ని గమనించారు. క్షతగాత్రులను బేస్తవారిపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. హర్షణ్ ముక్కు వద్ద లోతైన గాయమైంది, మిగిలిన ముగ్గురుకి స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

క్లుప్తంగా

మోడల్ స్కూల్లో ఎంఈఓ విచారణ



శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దదోర్నాల: మండల పరిధిలోని మోట్ల మల్లికార్జున పురంలో ఏపీ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఎంఈఓ మస్తాన్‌నాయక్ శుక్రవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో మెనూ అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న వైనంపై 'ఇదేంది సారూ.. రోజూ పప్పుచారు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంఈఓ స్పందించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులు చెప్పిన విషయాలతోపాటు ప్రిన్సిపాల్ వివరణను డీఈఓకు పంపినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

కొండపి: కొండపి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసినట్లు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొండపి మండలంలోని బాధితురాలైన ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాలను బట్టి నిందితులను కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్సై ప్రేమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా థియేటర్ సీజ్


సినిమా హాల్‌ను సీజ్ చేస్తున్న తహసీల్దార్

మద్దిపాడు: మండల పరిధిలోని ఓ సినిమా థియేటర్‌ను శుక్రవారం ఉదయం తహసీల్దార్ సుజన్ కుమార్ తన సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. అందిన వివరాల ప్రకారం.. వెల్లంపల్లి గ్రామంలో గత కొంతకాలంగా జీఎంఆర్ సినిమా హాల్ నిర్వహిస్తున్నారు. గతంలో రైస్ మిల్లుగా నిర్వహిస్తున్న కట్టడాన్ని ఎటువంటి బదలాయింపు లేకుండా సినిమా హాలుగా మార్పు చేశారని జేసీ గోపాలకృష్ణకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో జేసీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు థియేటర్‌ను సీజ్ చేశారు. తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో పూజిత, మహిళా పోలీస్ అనూష తదితరులు పాల్గొన్నారు.

వీఓఏ రూ.22 లక్షలు నొక్కేసింది

- ఏపీఎంకు బింగినపల్లి డ్వాక్రా మహిళల ఫిర్యాదు


ఐకేపీ కార్యాలయం వద్ద వేచి ఉన్న డ్వాక్రా మహిళలు

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి గ్రామానికి చెందిన వీఓఏ ఈశ్వరి సుమారు రూ.17 లక్షల డ్వాక్రా సంఘం నిధులు, రూ.5 లక్షల స్త్రీ నిధి నగదు స్వాహా చేసిందని గంగమ్మ డ్వాక్రా గ్రూప్ మహిళలు ఏపీఎం భాగ్య లక్ష్మికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆమెపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తానని ఏపీఎం భరోసా ఇచ్చారు.

కూటమి పాలనలో చిరుద్యోగులపై దాడులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులపై దాడులు పెరిగిపోయాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ యూనియన్ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లోనే వందలాది మంది చిరుద్యోగుల పొట్టకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల రూపాయలను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న పాలకులు.. రోడ్లు చిమ్ముకునే పారిశుధ్య కార్మికులను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. మేస్త్రీల మీద వైఎస్సార్ సీపీ ముద్ర వేసి 106 మందిని విధుల నుంచి తొలగించారని, వారిని విధుల్లో తీసుకోవాలని కోరుతూ 50 రోజులుగా పోరాటం చేస్తున్నప్పటికీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మేస్త్రీల కుటుంబాలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.మహేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చెత్త సేకరణకు నియమించిన 60 మంది క్లాప్ డ్రైవర్లను, ఆటోలను సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించడాన్ని తప్పుబట్టారు. ఈ నిర్ణయంతో క్లాప్ డ్రైవర్ల కుటుంబాలు పస్తులుండాల్సి వస్తుందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులను తొలగిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయమ్మ, కొర్నెపాటి శ్రీనివాసరావు, సామ్రాజ్యం, దివ్య, సంతోషమ్మ, తిరుపతమ్మ, రవి, వెంకయ్య, బాబు, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆదివాసీలపై మారణకాండ ఆపాలి


ధర్నా చేస్తున్న వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టే లక్ష్యంతో మధ్య భారత దేశంలోని ఆదివాసీలపై కొనసాగిస్తున్న మారణ హోమాన్ని ఆపాలని, తక్షణమే కాగర్ ఆపరేషన్‌ను నిలిపి వేయాలని వామపక్షాలు, విప్లవ, దళిత హక్కుల సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం సీపీఐ నాయకుడు కె.వీరారెడ్డి అధ్యక్షత కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దండకారణ్యంలో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టడాన్ని, ఆదివాసీలను నిర్వాసితులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రశ్నించే గొంతులపై అర్బన్ నక్సలైట్ ముద్రలు వేసి కేసులు పెట్టి అణచి వేసే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆదివాశీల మీద దాడులు ఎక్కువయ్యాయన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు కట్టబెట్టే కుట్రలను ప్రజలందరూ తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి పిలుపునిచ్చారు. సభలో బి.పద్మ, చుండూరి రంగారావు, నాంచార్లు, మోహన్, సుధాకర్, క్రాంతి, నరసింహారావు, కోటి, ప్రకాశరావు, రాజ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు


- మంచంపట్టిన 2 గ్రామాలు
- సూదిమందుకూ దిక్కు లేదు



జ్వరంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి

ముండ్లమూరు(కురిచేడు): మండలంలోని అగ్రహారం, నూజిళ్లపల్లి గ్రామాల ప్రజలు విషజ్వరాలతో మంచంపట్టారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో దోమలు, వైరస్‌లు విజృంభిస్తున్నాయి. వాటి వలన విషజ్వరాలు, మలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ వైద్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో జ్వరపీడితులు సూదిమందు వేసే దిక్కులేక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. జ్వరం, ఒళ్లునొప్పులతో నడవలేని స్థితిలో ప్రజలున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నా పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేయకుండా, దోమల మందు కొట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు అద్దంకి, దర్శి లాంటి పట్టణాలకు వెళ్లి ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్నారు. వేలకు వేలు ఖర్చు చేసుకుని ఇల్లు వదిలిపోయి ఆస్పత్రుల పాలవుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు ఇంటింటికీ వలంటీర్లు, వైద్యసిబ్బంది వచ్చి జ్వరపీడితులను గుర్తించేందుకు సర్వే చేసేవారు. వారికి అవసరమైన వైద్యచికిత్సలు ఇళ్ల వద్దే అందించేవారు. కానీ ఇప్పుడు పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి జ్వర పీడితులను గుర్తించి వైద్యచికిత్సలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ముద్ద మింగుడు పడలేదా?

- సింగరాయకొండ జెడ్పీ స్కూల్లో హోటల్ భోజనం తిన్న డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు
- మధ్యాహ్న భోజనం రుచి చూసి హోటల్ ఫుడ్ తినడంపై విస్మయం


మధ్యాహ్న భోజనాన్ని ఇలా రుచి చూసి..


హోటల్ భోజనం తింటున్న డీవైఈఓ

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలు డొల్లేనని జిల్లాలో వరుసగా బయటపడుతున్న సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. పెద్దదోర్నాలలోని ఏపీ మోడల్ స్కూల్లో అసలు మెనూ అమలు చేయని వైనం తెలిసిందే. తాజాగా శుక్రవారం సింగరాయకొండలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న జెడ్పీ హైస్కూల్లో భోజనం బాగోలేదన్న విషయం ఒంగోలు డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు చర్యతో బయటపడింది. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించిన డీవైఈఓ.. కాసేపటి తర్వాత హోటల్ నుంచి తెప్పించిన భోజనాన్ని పాఠశాలలోనే తాపీగా భుజించారు. ఇదంతా చూసిన విద్యార్థులు.. ×ఔరా మనకేమో ఈ చప్పిడి కూడు, సారుకేమో హోటల్ ఫుడ్డు¸ అని చర్చించుకున్నారు. ఈ విషయం ఆనోటా ఈనోటా బయటకు పొక్కడంతో మధ్నాహ్న భోజన పథకం నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. హోటల్ ఫుడ్డు తిన్న డీవైఈఓ.. పాఠశాలలో భోజనం బాగుందని కితాబివ్వడం గమనార్హం.

జీజీహెచ్‌లో ఆధార్ నమోదు కేంద్రం


ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

ఒంగోలు టౌన్: జనన మరణాల ధ్రువీకరణ పత్రాలను వందేళ్ల వరకు భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉప సంచాలకులు ఎం.శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన శిశు ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సీఎస్సీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పుట్టిన వెంటనే శిశు ఆధార్ నమోదు చేయాలని సూచించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యేరోజునే తల్లిదండ్రులకు బిడ్డ జనన ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలన్నారు. శిశు ఆధార్ తో పాటుగా అభా ఐడీ ఇవ్వాలని చెప్పారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ మాధవీ లత, జిల్లా స్టాటిస్టికల్ అధికారి ప్రసాదరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ అనంత లక్ష్మి, మెడికల్ రికార్డు టెక్నీషియన్ శ్రీనివాస రావు, సీఎస్సీ జిల్లా మేనేజర్ ప్రమోద్ పాల్గొన్నారు.

మూడు కేజీల గంజాయి పట్టివేత


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

గిద్దలూరు(బేస్తవారిపేట): గిద్దలూరు అర్బన్ కాలనీలో గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గిద్దలూరు ఎస్టీ కాలనీలో గత కొన్ని రోజులుగా గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా ఉంచారు. కావడి అశోక్ ఆధ్వర్యంలో 10 గ్రాముల గంజాయి రూ.500 ప్రకారం అమ్ముతున్నట్లు గుర్తించారు. అతనితోపాటతు తెలంగాణకు చెందిన మరో ఇద్దరు కె.రోహిత్, ఎస్.మురళీకృష్ణ అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. తెలంగాణ వ్యక్తులు గత కొంత కాలంగా విశాఖపట్నం నుంచి గిద్దలూరుకు గంజాయి తరలించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తామన్నారు. సమావేశంలో గిద్దలూరు సీఐ సురేష్, రూరల్ ఎస్సై రామకోటయ్య పాల్గొన్నారు.

సిసోడియాకు కలెక్టర్ స్వాగతం


రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియాకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ: రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియాకు ఒంగోలు నగరంలోని ఓ హోటల్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ చినఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న పుష్పగుచ్ఛాలతో శుక్రవారం స్వాగతం పలికారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారం, రీసర్వే జరుగుతున్న తీరుపై శనివారం సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సిసోడియా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు.

నత్తనడకన బాల ఆధార్

- జిల్లాలో 0–6 ఏళ్లలోపు చిన్నారులు 1,25,274 మంది
- ప్రత్యేక క్యాంపుల్లో 11 శాతం పిల్లలకే ఆధార్ నమోదు
- జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకోక, సరైన అవగాహన లేక మందకొడిగా సాగుతున్న ప్రక్రియ


బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద చిన్నారుల ఆధార్ నమోదు

బేస్తవారిపేట: జిల్లాలో బాల ఆధార్ నమోదు నత్తనడకన సాగుతోంది. 0–6 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించాలని ప్రభుత్వం ప్రకటనలిస్తున్నా ప్రత్యేక క్యాంపుల నిర్వహణ లోపభూయిష్టంగా సాగుతోంది. దీంతో క్షేత్ర స్థాయిలో ఆశించిన స్థాయిలో ఫలితం కనపడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆధార్ నమోదు చేయించేందుకు సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ చూపించి చిన్నారులకు తమ సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు, ఆధార్ కేంద్రాలకు తీసుకువెళ్లి వివరాలు నమోదు చేయించాల్సి ఉంది. అయితే గ్రామ స్థాయిలో సిబ్బంది, అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో నమోదు ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్నారనే విషయం చాలా మందికి తెలియకపోవడం శోచనీయం. అలాగే గ్రామ/వార్డు సచివాలయాలకు కూడా అరకొరగానే ఆధార్ కిట్లను సరఫరా చేశారు. కొన్ని సచివాలయాల్లో ఆధార్ నమోదు కిట్లు పనిచేయకపోవడం, లాగిన్ సమస్యలతో ఆధార్ నమోదు ప్రక్రియ నిలిచిపోయింది.

జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 40 మండలాల్లో 2,903 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0–6 సంవత్సరాలలోపు పిల్లలు 1,25,274 నమోదై ఉన్నారు. 96,650 మందికి ఆధార్ ఉంది. ఆధార్ లేని పిల్లలు 26,593 మంది కాగా బర్త్ సర్టిఫికెట్ ఉన్న పిల్లలు 10,093 మంది ఆధార్ పొందలేదు. మరో 15,631 మందికి ఇప్పటి వరకు బర్త్ సర్టిఫికెట్ తీసుకోలేదు. జిల్లాలో 0–6 ఏళ్లలోపు చిన్నారుల్లో 53.1 శాతం మందికి ఆధార్ ఉండగా.. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసిన తర్వాత ఈ రెండు నెలల వ్యవధిలో 11 శాతం మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు.
